ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 25 ఏప్రిల్ 2024



జన హోరు

అట్టహాసంగా సవిత నామినేషన్

కిక్కిరిసిన పెనుకొండ వీధులు

జనసంద్రం నడుమ ర్యాలీ

జిల్లాలో ఆరోరోజు నామినేషన్లు ఇలా..

మొత్తం నామినేషన్లు	44
ఎంపీ స్థానానికి	6
అసెంబ్లీ స్థానాలకు	38
మడకశిర	10
ధర్మవరం	9
పుట్టపర్తి	7
పెనుకొండ	5
హిందూపురం	4
కదిరి	3



జనసందోహం నడుమ సాగుతున్న సవిత నామినేషన్ ర్యాలీ

ర్యాలీలో ప్రసంగిస్తున్న సవిత



నామినేషన్ సమర్పిస్తున్న సవిత, చిత్రంలో ఆమె భర్త వెంకటేశ్వర్‌రావు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 24: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత నామినేషన్ వేలాది మంది కార్యకర్తల నడుమ బుధవారం అట్టహాసంగా సాగింది. రెండో సెట్ నామినేషన్‌ను ఆమె దాఖలు చేశారు. ముందుగా బాబయ్యస్వామి దర్గాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ర్యాలీకి తరలి వెళ్లారు. పట్టణంలోని రామమందిరం నుంచి పెనుకొండ ప్రధాన వీధులగుండా పెద్దఎత్తున నామినేషన్‌కు బయలుదేరారు. అడుగడుగునా నేతలు, శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద క్రేన్ సాయంతో గజమాల వేశారు. జనం నినాదాలతో హోరెత్తించారు. జనం వేలాదిగా తరలిరావడంతో పెనుకొండ వీధులు కిక్కిరిశాయి. జనసంద్రం నడుమ సవిత నామినేషన్ ర్యాలీ సాగింది. అనంతరం హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావుతో కలిసి నామినేషన్ వేసేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు నామినేషన్ సమర్పించారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని వైసీపీ వనరులుగా మార్చుకుందన్నారు. సాగు, తాగునీరు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో అడుగు రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. అధికారం రాగానే అనువైన చోట మహిళలకు గార్మెంట్స్ పరిశ్రమ, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పసుపుమయమైన మడకశిర

■ వేలాది మంది నడుమ ఎంఎస్ రాజు ర్యాలీ



ర్యాలీకి హాజరైన జనం

మడకశిరటౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి మడకశిర అభ్యర్థి ఎంఎస్ రాజు నామినేషన్ ర్యాలీ బుధవారం వేలాది మంది నడుమ సాగింది. పట్టణ వీధులు పసుపుమయమయ్యాయి. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకుని, రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం వాల్మీకి సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాదిగా తరలివచ్చిన జనసందోహం మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అప్పట్లో ఆగిపోయిన ఇరవై శాతం పనులను కూడా పూర్తిచేయలేని అసమర్థ ప్రభుత్వం జగన్‌ది అని మండిపడ్డారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో సీనియర్లు, యువ నాయకులన సమన్వయం చేసుకుంటూ విజయం దిశగా సాగుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచార వాహనంపై ఎమ్మెల్యే అభ్యర్థి తదితరులు



నామినేషన్ సమర్పిస్తున్న ఎంఎస్ రాజు, చిత్రంలో గుండుమల తదితరులు

అంబులెన్స్‌కూ దారివ్వరా..!





జనం మధ్యలో చిక్కుకున్న 108 వాహనం, ప్రభుత్వాస్పత్రి లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు

ప్రాణాపాయంతో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించే 108 వాహనానికి ఎవ్వరైనా దారివ్వాల్సిందే. 108 వాహన సైరన్ వింటే ఎంతటి వారైనా పక్కకు తప్పుకుని మరీ దారిస్తారు. వైసీపీ నాయకులకు మాత్రం అవేవీ పట్టలేదు. హిందూపురంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక బుధవారం ఎన్నికల నామినేషన్ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వాస్పత్రి వద్ద రోడ్డుకు ఓవైపు 100 మీటర్ల పరిధిలోపల ఎవరినీ అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. మరోవైపు రోడ్డులో రాకపోకలకు అవకాశం కల్పించారు. ఆ రోడ్డు ర్యాలీగా వచ్చిన వారితో నిండిపోయింది. అదే సమయంలో రోగితో అంబులెన్స్ అటుగా వచ్చింది. జనం మధ్యలో చిక్కుకుంది. ఎంతసేపు హారన్ మోగించినా ప్రయోజనం లేదు. అందులో ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు పోలీసులు వచ్చి జనాన్ని పక్కకు పంపించి, అంబులెన్స్‌కు దారిచ్చారు. దీంతో అంబులెన్స్ ఆస్పత్రిలోకి వెళ్లింది.

-హిందూపురం అర్బన్

ఒక్కొక్కరికి ఒక్కో రూల్..!



మూతపడిన షాపులు

పోలీసులు ఒక్కొక్కరికి ఒక్కో రూల్ అమలు చేస్తుండడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అందరికీ ఒకే విధంగా నిబంధనలు పాటించాలి. టీడీపీకి ఒకలా, వైసీపీకి మరోలా నిబంధనలు అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయ. రెండ్రోజుల క్రితం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ నామినేషన్ దాఖలు సమయంలో రోడ్డుకు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ఒకవైపు వాహనాలను వదలకుండా అడ్డుకున్నారు. ఆ సమయంలో షాపులు తెరిచి, వ్యాపారాలు చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. పోలీసులు భిన్నంగా వ్యవహరించారు. షాపులను పూర్తిగా మూయించారు. అనవసరంగా షాపులు బంద్ చేయించి, తమ వ్యాపారాలు దెబ్బతీసారని వ్యాపారులు మండిపడుతున్నారు. టీడీపీ నామినేషన్ రోజున ఒకలా.. వైసీపీకి మరోలా నిబంధనలు అమలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

-హిందూపురం అర్బన్

తప్పు ప్రభుత్వానిది..

నోటీసులు ఉపాధ్యాయులకా?

ఇది కక్ష సాధింపే.. ఏపీటీఎఫ్ నాయకుల మండిపాటు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, ఏప్రిల్ 24: ప్రభుత్వం పాఠశాలలకు ఇంటర్నెట్ కనెక్షన్, రూటర్స్ ఇవ్వకుండా.. ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం తగదని ఏపీటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ మీనాక్షికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 62 మంది ఎంఈఓలు, 38 మంది జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 420 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు యూడైస్‌లో స్కూళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం లేదని పొందుపరిచినందుకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి యూడైస్ పూర్తిచేసే సమయానికి పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం లేదన్నారు. ఇంటర్నెట్‌కు సంబంధించి పరికరాలు, రూటర్స్ కానీ సరఫరా చేయలేదన్నారు. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు యూడైస్‌లో పొందుపరిచారన్నారు. ప్రభుత్వ తప్పిదాన్ని ఎత్తిచూపినందుకే కక్షగట్టి రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ఇది కక్షసాధింపేనన్నారు. ఇప్పటికైనా పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అనంతరం డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు పీవీ మాధవ, ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర, మండల ప్రధాన కార్యదర్శి జయరాం, నాయకులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం: యూటీఎఫ్

పెనుకొండ: ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు విద్యాశాఖాధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమగ్రశిక్ష విభాగంలో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎస్‌ఓ, ఏపీఓ పోస్టులను నెలలుగా భర్తీ చేయకపోవడమే ప్రధాన కారణమని ఆరోపించారు. సరైన సమయంలో ఈ పోస్టులు భర్తీచేసి ఉండుంటే సమయంలో వాస్తవ సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులకు అందించేవారన్నారు. యూడైస్‌లో వాస్తవాలను పొందుపరచినందుకు ఇలా నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇది పూర్తిగా విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇందుకు వారే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కర్ణాటక కిక్కు..!

వైసీపీ నామినేషన్‌కు యథేచ్ఛగా మద్యం సరఫరా



బైక్‌లో కర్ణాటక మద్యం తరలిస్తున్న వైసీపీ కార్యకర్త

లేపాక్షి, ఏప్రిల్ 24: హిందూపురం నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి దీపిక నామినేషన్‌కు యథేచ్ఛగా కర్ణాటక మద్యం సరఫరా చేశారు. అధికారం ఉంది కదా అని ఆ పార్టీ కార్యకర్తలు కర్ణాటక మద్యాన్ని ద్విచక్రవాహనంలో పబ్లిక్‌గానే తరలించారు. గ్రామ చివరన మందు సేవించి, నామినేషన్ కార్యక్రమానికి హాజరైనట్లు ప్రజలు చర్చించుకున్నారు. ద్విచక్రవాహనంలో మద్యం తరలించడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. పబ్లిక్‌గానే మద్యం తరలిస్తున్న పోలీసులు తనిఖీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పోలీసు అబ్జర్వర్‌గా ఇమ్మల్‌ఎంసా



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న పోలీసు అబ్జర్వర్ ఇమ్మల్ ఎంసా

పుట్టపర్తి, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా పోలీసు అబ్జర్వర్‌గా నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారి ఇమ్మల్ ఎంసాను ఎన్నికల కమిషన్ నియమించింది. దీంతో ఆయన బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎన్నికల పరిశీలనపై కలెక్టర్, ఎస్పీ మాధవరెడ్డితో సమీక్ష నిర్వహించారు.

మార్మోగిన సాయినామం

ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు

- భక్తులకు పెద్దఎత్తున నారాయణ, వస్త్ర సేవలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మహాసమాధి



నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, ఏప్రిల్ 24: సాయినామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది. సత్యసాయిబాబా 13వ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలోని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల వేదపఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి సేవలపై యాప్‌ను ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. గవర్నర్ తన ప్రసంగంలో ప్రాచీన గ్రంథాల్లోని సూక్తులను వివరిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు, నందినీరావు బృందం సంగీత కచేరితో భక్తులను అలరించారు. హిల్‌వ్యూ స్టేడియంలో భక్తులకు నారాయణ, వస్త్ర సేవలను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, నిర్వహించారు. వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.


రెండేళ్లపాటు శత జయంత్యుత్సవాలు

నారాయణ సేవ అనంతరం మీడియాతో ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ.. సత్యసాయి శత జయంత్యుత్సవాలను రెండేళ్లపాటు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 2025-26 సంవత్సరాల్లో శత జయంత్యుత్సవాలు పెద్దఎత్తున నిర్వహించడానికి కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ప్రత్యేకంగా 100 రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగానందం, మోహన్, సేవాసంస్థల ప్రతినిధులు చలం, వెంకటరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సత్యసాయి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి కలెక్టర్ అరుణ్‌బాబు పూల మాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఏఎస్పీ విష్ణు పాల్గొన్నారు.





సాయి సన్నిధిలో కేరళ గవర్నర్



పాటలు పాడుతున్న విద్యార్థినులు

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 26.0	40.0 26.0	41.0 26.0	39.0 24.0	39.0 25.0



కూలీల ప్రచారం

సార్వత్రిక ఎన్నికలు కొందరి పొట్ట నింపుతున్నాయి. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చాలా ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి. దీంతో రెక్క ఆడితే గాని డొక్కాడని కూలీలకు జీవనోపాధి కష్టంగా మారింది. చాల మంది పనులు లేక ఇళ్ల వద్దే ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారానికి వస్తే భోజనంతో పాటు, కూలి డబ్బులు ఇస్తామని ప్రధాన పార్టీలు వారికి ఆఫర్ ఇచ్చాయి. ఇంకేముంది పార్టీ ఏదైతేనేమి కూలి ముఖ్యమన్నట్లుగా కూలీలంతా ఎన్నికల ప్రచారంలోకి దూకారు. జెండాలు చేతపట్టి, కనబడ్డవారికి కరపత్రాలు ఇస్తూ కూలి ఇస్తున్న అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి నామినేషన్ పర్వంలో కోలాహలమంతా వీరిదే. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు మహిళలకైతే రూ200, పురుషులకైతే రూ.500 ఇస్తున్నట్లు కూలీలు బహిరంగంగానే చెబుతున్నారు.

- మడకశిర రూరల్

అభివృద్ధికే నా ఓటు

టి.హసీనా, సిండికేట్ నగర్, అనంతపురం రూరల్ మండలం



నేను తొలిసారి ఓటు వేయబోతున్నా. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే వారికే ఓటు వేస్తా. ప్రస్తుతం ఐటీ అంటే హైదరాబాదు, బెంగళూరు గుర్తుకొస్తాయి. ఆ విధంగా రాష్ట్రంలోను ఐటీని అభివృద్ధి చేయాలి. సైన్స్ పరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం చాలా ఉంది. భవిష్యత్తుకు ఉపయోగపడే పరిశోధనలు చేసేందుకు ఆస్కారం కల్పించాలి. ముందు చూపుగల నాయకులను ఎన్నుకోవాలి.

- అనంతపురం రూరల్

నలుగురైదుగురు చర్చించుకునేవాళ్లం



నంబులపూలకుంట: ఇంకా రెండు, మూడు దినాల్లో ఎన్నికలు జరుగుతాయనగా ఊర్లో ఉండేవారు వాళ్లకు అనుకూలమైన నలుగురైదుగురితో ఎవరికి ఓటు వేయాలనే విషయమై మాట్లాడుకునేవారు. ఎవరికి ఓటేస్తే గ్రామానికి మంచి చేస్తాడనే విషయమై చర్చ సాగేది. మా చుట్టుపక్కల గ్రామాలైన బందారుచెట్లపల్లి, ఎగువపల్లి, వంకమద్ది, పోరెడ్డివారిపల్లి గ్రామాలనుంచి కూడా కొంత మంది ఒక చోట చేరి, ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుని వేసేవారం. అప్పట్లో కంకి, కొడవలి గుర్తు పార్టీ ఉండేది. చేయి గుర్తు ఉన్న పార్టీ కూడా ఉండేది. మేమంతా స్వచ్ఛందంగానే ఓటు వేసే వాళ్లం. అప్పుడు రాజకీయాలు నీతిగా, న్యాయంగా ఉండేవి. ప్రస్తుతం అభ్యర్థి తరపున నాయకులే రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పిస్తున్నారంటే రాజకీయాలు, ఎన్నికలు ఎలా మారాయో మీరే ఊహించుకోండి.

- వెంకటయ్య, పోరెడ్డివారిపల్లి

అప్పట్లో నిజాయితీగా ఓటు వేసే వాళ్లు



మడకశిర: ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు, అంకితభావం లేకుండా పోయాయి. అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత ఆర్భాటంగా ఉండేది కాదు. సిద్దనగౌడ్ శాసనసభ్యుడు అయినా అద్దె ఇంట్లో ఉండేవారు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థితో పాటు నాయకులు గ్రామాలకు వచ్చినా నేరుగా ప్రచారానికి వెళ్లే వారు కాదు. గ్రామంలోని ఐదారుగురు పెద్ద మనుషులతో మాట్లాడి ఒక చోట సమావేశాన్ని ఏర్పాటు చేసే వారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకుని గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చే వారు. గ్రామ పెద్దల మాట మీద వారికి ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఎన్నికలంటే ఖర్చుతో కూడు కూడుకున్నాయి. అప్పట్లో మద్యం, డబ్బులు పంపిణీ చేసే వాళ్లు కాదు. ఆకు వక్క ఇచ్చినా గ్రామంలో తీసుకునే వాళ్లు కారు. నిజాయితీగా ఓటు వేసే వాళ్లు.

- మేళవాయి నారాయణరెడ్డి

జన కేతనం

ఆంధ్రజ్యోతి

ఇంటికి వద్దన్నా ఓటు..!

బాగున్నవారికీ ఇంటి వద్దకా?.. బీఎల్ఓల రాకతో వెలుగులోకి..

హిందూపురం, ఏప్రిల్ 24: ఇంటి వద్దకే ఓటులో అధికార పార్టీ అడ్డదారులు తొక్కిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దివ్యాంగులు, 85 ఏళ్లపైబడిన వారికే ఇళ్ల వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. హిందూపురం మండలంలో ఎలాంటి వైకల్యమూ లేని చిన్నవయసు వారికీ ఇంటి వద్దకే ఓటు హక్కు కల్పిస్తామంటూ బీఎల్ఓలు ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో ఓటర్లు అవాక్కవుతున్నారు. హిందూపురం మండలం వీవర్స్ కాలనీలోని 134, 135, 136 పోలింగ్ బూత్‌లలో ఇలాంటివి వెలుగులోకి వచ్చాయి. వాటి పరిధిలోని బీఎల్ఓలు బుధవారం ఓటర్ల ఇళ్ల వద్దకెళ్లి 13డి ఫారాలు ఇచ్చారు. సంతకం పెట్టాలని ఒత్తిడి తెచ్చారు. 134 బూత్ పరిధిలో వి.చిరంజీవికి ఇంటి వద్దే ఓటు వినియోగించుకోవచ్చనీ, 12డి ఫారంలో సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. తనకెందుకు ఇంటివద్దకనీ, పోలింగ్ కేంద్రం వద్దకొచ్చి ఓటేస్తానని అతడు చెప్పాడు. పైఅధికారులు చెప్పారనీ, నోటీసు తీసుకుని సంతకం పెట్టాలని బీఎల్ఓ కోరారు. అనుమానం వచ్చి సంతకం పెట్టడానికి నిరాకరించారు. చిరంజీవి వయసు 40 ఏళ్లు, ఎలాంటి వైకల్యమూ లేదు. అయినా ఎందుకిచ్చారో అర్థంకాని పరిస్థితి. అదే ప్రాంతంలో సుగణ వయసు 43 ఏళ్లు. ఈమెకు నోటీసు ఇవ్వడానికి వెళ్లారు. 35 ఏళ్ల నేత్రావతికి 12డి ఫారం తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. వారు ససేమిరా అన్నారు.

కేంద్రానికి 30 నుంచి 40 ఓట్లు..

నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఇలాంటివి 30 నుంచి 40 ఓట్లు ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బుధవారం మూడు బూత్‌లు మాత్రమే వెలుగులోకి వచ్చాయనీ, పూర్తిగా ఆరాతీస్తే నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు వెలుగులోకి వస్తాయో అర్థంకాని పరిస్థితి. ఈ లెక్కన నియోజకవర్గంలో 250 బూత్‌లున్నాయి. ఇలా 30 నుంచి 40 ఓట్లు లెక్కన కనీసం 10వేల ఓట్లు ఇలాంటివి ఉండవచ్చని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

వలంటీర్ల పనేనా?

ఓటరు జాబితా పరిశీలన సందర్భంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా ఇలాంటి ట్రిక్ చేసినట్లు ఓటర్లు భావిస్తున్నారు. అప్పట్లో బాగున్నా.. వైకల్యముందనీ, తక్కువ వయసున్నా ఎక్కువ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరిచారని సమాచారం. అప్పుడు వలంటీర్లు ఇచ్చిన జాబితా మేరకే ప్రస్తుతం నోటీసులు తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 26న తుది ఓటర్ల జాబితా రానున్న నేపథ్యంలో రెండు రోజుల ముందు ఇలాంటివి వెలుగులోకి రావడంతో టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పని ఎవరు చేసి ఉంటారని ఆరాతీస్తున్నారు. ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సక్రమంగా ఉందా.. లేదా అని టీడీపీ నాయకులు చూసుకుంటున్నారు. ఇలాంటి ట్రిక్ చేశారని తెలియదు. బుధవారం బీఎల్ఓలు నోటీసులు తీసుకెళ్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజులుగా వైసీపీ నాయకులు బహిరంగంగా తమకు 10 వేల నుంచి 15వేల ఓట్లు ఫిక్స్‌డ్‌గా ఉన్నాయనీ, అవి ఎలా పడతాయో నెలాఖరున తెలుస్తుందని చెప్పుకుంటున్నారు. ఈ ఓటరు జాబితాకు సంబంధించి గత వారంలో మంత్రి పెద్దిరెడ్డి హిందూపురం ముఖ్య నేతలను పిలిపించుకుని మాట్లాడినట్లు సమాచారం. తమకు 20వేల ఓట్లు ఫిక్స్‌డ్‌గా ఉన్నాయనీ, తుది ఓటరు జాబితా ప్రకటించాక తెలుస్తుందన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 12డి ఫారాలను అందజేస్తుండడాన్ని బట్టి చూస్తే మంత్రి చెప్పిన మాట నిజమేనని టీడీపీ నాయకులు అంటున్నారు. ఇలాంటివి ఎన్ని ఉన్నాయో గుర్తించి ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.





క్రియాశీలకం

కియ రాకతో ఇంటర్న్‌షిప్ అవకాశాలు మెండు... పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రాక్టికల్‌గా తర్ఫీదు

శిక్షణతోపాటు పారితోషికం... ఏటా వేల మంది సద్వినియోగం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24: పరిశ్రమలు ఆయా ప్రాంతాల అభివృద్ధికి పర్యాయపదాలుగా నిలుస్తున్నాయి. పరిశ్రమ ఎక్కడైతే ఏర్పాటవుతుందో ఆ ప్రాంత రూపురేఖలు సమూలంగా మారిపోతాయి. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు పుష్కలంగా దొరుకుతాయి. దీంతో వారు ఓ వైపు చదువు కొనసాగిస్తూనే ప్రతి నెలా వేలల్లో పారితోషికాన్ని పొందే అవకాశం ఏర్పడుతుంది. పైగా ఇక్కడ ప్రాక్టికల్‌గా సంపాదించుకున్న జ్ఞానంతో భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఉమ్మడి జిల్లాకు కియ రావడంతో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి మంచి అవకాశమేర్పడింది. అక్కడ పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రాక్టికల్‌గా తర్ఫీదు ఇస్తారు.

వేలమందికి ఇంటర్న్‌షిప్..

కియ దాని అనుబంధ పరిశ్రమలతో ప్రతి సంవత్సరం వేలమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లభిస్తోంది. నాలుగు సంవత్సరాల బీటెక్, మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు భౌతికంగా తర్ఫీదునిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌లో మెరుగైన నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులను ఉద్యోగాల్లోకి తీసుకుం టున్నాయి. దీంతో కళాశాలల యాజమాన్యాలు వారి విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు పంపడానికి పోటీపడుతున్నాయి. పరిశ్రమలిస్తున్న ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్స్‌తో బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.

పరిశ్రమలతోనే..

పాలిటెక్నిక్ కోర్సులకు అనుగుణంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఒకే సమ యంలో శిక్షణతోపాటు కోర్సు పూర్తి అవుతుంది. కియ, దాని అనుబంధ పరిశ్రమలతో వేలాది మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లభిస్తోంది. అదేవిధంగా పారితోషికాన్ని చెల్లించడమే కాకుండా ఉచిత భోజన, రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆసక్తిగా ఇంటర్న్‌షిప్ చేస్తూ శిక్షణ పొందుతున్నారు.

- రామచంద్రారెడ్డి, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్



ప్రాక్టికల్‌గా పట్టు సాధిస్తున్నారు

తరగతిలో అభ్యసించిన పాఠ్యాంశ సారాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ పొంది వాటిపై పట్టు సాధిస్తున్నారు. విద్యార్థులు సొంతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఇంటర్న్‌షిప్ దోహదపడుతోంది. కరువు జిల్లాలో కియ పరిశ్రమ విద్యార్థులకు ఒక వరం. తాడిపత్రిలో అల్ట్రాటెక్ వంటి పరిశ్రమలు ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. చెన్నై వంటి నగరాల్లో పెద్దపెద్ద పరిశ్రమలకు విద్యార్థులు వెళ్తున్నారు.

- రామాంజనేయులు, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ లెక్చరర్

రూ.13వేల పారితోషికం



ఇంటర్న్‌షిప్‌తోపాటు నెలకు రూ.13వేల పారితోషికాన్ని చెల్లిస్తున్నారు. అనంతపురం నుంచి ఉచితరవాణా. క్యాంటీన్‌లో భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను పరిశ్రమలో ప్రాక్టికల్‌గా నేర్చుకోవడం మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. ఇలాంటి పరిశ్రమలు మరిన్ని ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకడమే కాకుండా వేలాదిమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా శిక్షణ దొరుకుతుంది.

- వీరేష్, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి

సులువుగా ఉద్యోగాలు పొందవచ్చు



ఇంటర్న్‌షిప్ పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలను సులువుగా పొందవచ్చు. తాడిపత్రి బుగ్గలోని అల్ట్రాటెక్ పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశా. అందుకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. భౌతికంగా పరిశ్రమల్లో పనిచేయడం ద్వారా కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మార్గాలను అన్వేషించవచ్చు. కోర్సులకు అనుగుణంగా పరిశ్రమలు లేకుంటే చదువుకున్న విద్యకూడా వృథా అవుతుంది.

- మోహనయ్య, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి

కొత్త అనుభూతి ఇస్తున్న కియ



కియ రాక ఆ ప్రాంత రూపురేఖలను మార్చేసింది. అక్కడ ఇంటర్న్‌షిప్ చేయడం కొత్త అనుభూతిని ఇస్తుంది. కళాశాలలో నేర్చుకోవడం కన్నా భౌతికంగా పరిశ్రమలో శిక్షణ పొందుతూ నేరుకుంటే సబ్జెక్టుపై పట్టుపెరుగుతుంది. అంతర్జాతీయ సంస్థల్లో కూడా సులువుగా పని చేసేందుకు దోహదపడుతుంది. ప్రతి నెలా పారితోషికాన్ని చెల్లిస్తూ ఉచిత రవాణా, క్యాంటీన్ సౌకర్యాన్ని కల్పించడం నాలాంటి విద్యార్థుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతుంది.

- సప్తగిరివర్మ, పాలిటెక్నిక్ విద్యార్థి



వైసీపీని వీడుతున్నట్లు ప్రకటిస్తున్న బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాశ్ బాబు, మరికొందరు (ఫైల్)



జగన్ పార్టీకి ఝలక్..!

- వైసీపీకి గుడ్‌బై చెబుతున్న జడ్పీటీసీ, ఎంపీపీలు
- పనులు సాగక తీవ్ర అసంతృప్తి
- ఎటూ ఓడే పార్టీ అంటూ వీడుతున్న సభ్యులు
- ఇప్పటికే ఇద్దరు జడ్పీటీసీలు దూరం
- ఒక ఎంపీపీ సైతం రాజీనామా
- అదే దారిలో మరికొందరు..

అనంతపురం విద్య, ఏప్రిల్ 24: ఎన్నికల వేళ అధికార పార్టీకి జడ్పీటీసీలు, ఎంపీపీలు షాక్ ఇస్తున్నారు. రోజుకొకరు పార్టీని వీడుతున్నారు. ఏళ్ల తరబడి వైసీపీలో ఉన్నా తాము ఎలాంటి పనులు చేసుకోలేకపోతున్నామన్న నిరాశ వారిలో కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీటీసీలకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండాపోయింది. దీంతో మండలాల్లో అభివృద్ధి చేసుకోలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక వారు జగన్ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. టీడీపీ కూటమికి గెలుపు అవకాశాలు పెరుగుతున్నాయని భావించి.. అత్యధికులు కూటమి వైపు చూస్తున్నారు.

వలసలు మొదలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీని వీడుతున్నారు. కూటమి పార్టీల్లో చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. జడ్పీ ఎన్నికలు గతంలో ఏకపక్షంగా సాగాయి. దీంతో టీడీపీ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు మాత్రమే గెలిచారు. మిగిలిన స్థానాలన్నీ వైసీపీకి సొంతమయ్యాయి. అంతటి హవాలో సైతం అగళిలో టీడీపీ అభ్యర్థి జడ్పీటీసీగా గెలిచి నిలిచారు. ఇంతమంది గెలిచినా.. వైసీపీ జడ్పీటీసీలకు ఆ పార్టీ న్యాయం చేయలేదు. రెండున్నరేళ్ల నుంచి వారిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇటీవలే చిలమత్తూరు వైసీపీ జడ్పీటీసీ అనూష టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ వర్గానికి చెందిన అనూషతోపాటు పలువురు ఎంపీటీసీలు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ వైసీపీకి రాజీనామా చేశారు. ఆమెతోపాటు ఆమె భర్త, కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాశ్‌బాబు మరికొందరు సైతం జగన్ పార్టీ గుడ్‌బై చెప్పారు. సూర్యప్రకాశ్‌బాబు, ఆయన సతీమణి, బత్తలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కోటిసుధ, ఆయన సోదరులు ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేశ్, ఉపసర్పంచ్ కోటి గోపీనాథ్‌తో పాటు పలువురు బీజేపీలోకి చేరారు. వారు పట్టణంలో మంగళవారం కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, కేంద్రమంత్రి విజయ్‌కుమార్ సింగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కోటి కుటుంబానికి బత్తలపల్లి మండలంలో బలమైన వర్గం ఉంది. వీరి చేరికతో బత్తలపల్లిలో బీజేపీ బలం అమాంతం పుంజుకుంది. అదేవిధంగా ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సైతం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనను గత కొంత కాలంగా స్థానిక ఎమ్మెల్యే తీవ్రంగా వేధించినట్లు, అభివృద్ధి పనులు సైతం సాగకుండా అడ్డుపడినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో అభివృద్ధి శూన్యం అని భావించి ఆయన బీజేపీలో చేరారు. ధర్మవరం నియోజకవర్గం కూటమి అభ్యరి సత్యకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు జగన్ పార్టీ మునిగే నావగా భావించి టీడీపీ కూటమి వైపు చూస్తున్నారు.

త్వరలో మరికొందరు...

ఇప్పటికే జడ్పీటీసీలు, ఎంపీపీలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గత రెండున్నరేళ్లగా నిధులు రాక, అభివృద్ధి లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు జడ్పీకి వస్తే.. ఇక్కడి ఉన్నతాధికారులు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని, పాలకవర్గాన్ని పూర్తిగా విస్మరించి ముందుకెళ్తున్నా రంటూ ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలోనే జడ్పీ చైర్పన్‌తోపాటు, సుమారు 30 మంది వరకూ జడ్పీటీసీలు సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఫైర్ అయ్యారు. సమావేశాన్ని బహిష్కరించి, బయటకొచ్చి ఆందోళన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కనీసం స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. ఇలాంటి పరిస్థితుల నడుమ వైసీపీలో ఉన్నా మండలాల్లో అభివృద్ధి సాధించలేమన్న యోచనలో మెజార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు ఉన్నారు. దీంతో టీడీపీ- బీజేపీ కూటమిలో చేరేందుకు మెజార్టీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు. సుమారు 25 నుంచి 30 మంది వరకూ జడ్పీటీసీలు కూటమి బాట పట్టనున్నట్టు ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది.



వైసీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముదిగుబ్బ ఎంపీపీ (ఫైల్)



దుమ్ములోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో...?

అనంత నడిబొడ్డు టవర్‌క్లాక్ వద్ద దుస్థితి... రాకపోకలకు తీవ్ర అంతరాయం



శాంతి థియేటర్ వైపు సర్వీస్ రోడ్డు..

అనంతపురం సిటీ, ఏప్రిల్ 24 : నగరంలో అత్యంత ప్రధానమైన రహదారులలో పీటీసీ ఫ్లైఓవర్ బ్రిడ్జి ముఖ్యమైనది. కేంద్రం ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.311.93 కోట్లు వెచ్చించింది. 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఈ బ్రిడ్జికి ఒకవైపు (శాంతి థియేటర్, బెంగుళూర్ బేకరీ షాపు వైపు) సర్వీస్ రోడ్డు ఏళ్ల తరబడి నిర్మాణ పనులు చేయకపోవడంతో అవస్థల నడుమ వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, మేయర్ తదితర ప్రజా ప్రతినిధులకు నిత్యం ఈ సమస్య కనిపిస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. కొందరు ప్రైవేట్ స్థలాల వ్యక్తులు పనులు చేస్తుంటే.. ఆ రోడ్డుపైకి దుమ్ము లేస్తోంది. అయినప్పటికి ఏ ఒక్కరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే మాత్రం.. బ్రిడ్జిని అన్ని హంగులతో పూర్తి చేశాం.. త్వరలోనే ఈ సర్వీస్ రోడ్డును పూర్తి చేస్తాం అని చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని నగర వాసులు విమర్శిస్తున్నారు. వాహనచోదకులు, పాదచారుల, సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల యజమానుల పరిస్థితి ఏమిటో ఈ చిత్రాలు చూస్తే తెలిసిపోతుంది. ఈ రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉండటంలో ఏమాత్రం వ్యాపారాలు జరగడం లేదని వాపోతున్నారు.

ఎల్‌ఎంకు అవమానం!


కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 24: నియోజకవర్గంలో పట్టున్న వైసీపీ సీనియర్ నాయకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డికి అవమానం జరిగిందని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి రంగయ్య బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆయన్ను రోడ్‌షోకే పరిమితం చేశారు. నెల రోజుల కిందట పార్టీలోకి వచ్చిన ఉమామహేశ్వర నాయుడుని మాత్రం నామినేషన్ దాఖలు చేయడానికి వెంట పెట్టుకుని ఆర్‌ఓ వద్దకు వెళ్లడంపై ఎల్‌ఎం అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనుచరులు, పట్టున్న సీనియర్ నాయకుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పిలిచి అవమానించడంలో ఆంతర్యమేమిటని నిలదీస్తున్నారు.



వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ఎం మోహన్‌రెడ్డి

చెప్పులు వేయించుకున్నవారికి ఎంపీ టిక్కెట్టా?

వైసీపీ రెబల్ ఎంపీ అభ్యర్థి గంపల రమణారెడ్డి



వెంకటరమణా రెడ్డి

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 24: 'రాష్ట్ర చరిత్రలో రెండుసార్లు చెప్పులు వేయించుకున్న నాయకుడు మాజీమంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ మాత్రమే. అలాంటి నాయకుడికి ముఖ్యమంత్రి జగన్ ఎంపీ టిక్కెట్ ఇవ్వడం బాధాకరం' అని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి అన్నారు. గోరంట్ల మండలం కరావులపల్లికి చెందిన రమణారెడ్డి అనంతపురం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు బుధవారం పెనుకొండలో మీడియాకు వివరించారు. గడచిన నాలుగున్నరేళ్లలో శంకర్‌నారాయణ ఎంత వేధించినా వైసీపీని వీడలేదన్నారు. వైసీపీకి చెందినవారిపైనే శంకర్‌నారాయణ 50 కేసులు బనాయిస్తే అందులో తమ సామాజికవర్గానికి చెందిన వారే 48 మంది బాధితులు ఉన్నారన్నారు. పలుమార్లు మా సమస్యలను ముఖ్యమంత్రి, ఇతర నేతలవద్దకు తీసుకెళ్తే దగ్గరకు రానీయలేదన్నారు. ఇప్పటికైనా అధిష్టానం పునరాలోచించాలని అన్నారు.


టవర్‌క్లాక్ వద్ద ఎండిపోయిన మొక్కలు

ఎంత సుందరమో..!

అనంతపురంలో ఏ రోడ్డు చూసినా నల్లగో లేక తెల్లగో కనపడుతున్నాయి కానీ ఎక్కడే కాసింత పచ్చదనమన్నది లేకుండా పోయింది. నగరాన్ని సుందరీకరించి, పచ్చదనంతో నింపుతామన్న పాలకుల మాటలు గాలిలో కలిసిపోయాయి. రూ. లక్షలు ఖర్చు పెట్టి నగరంలోని పలు రహదారుల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. అయితే వాటి ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో ఎండల దెబ్బకు అవన్నీ ఎండిపోయాయి. నగరంలో ఏ రోడ్డు డివైడర్లను చూసినా ఎండిన మొక్కలు లేదా... వాటి మధ్య పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

- అనంతపురం ప్రెస్‌క్లబ్


ఎన్టీఆర్ మార్గ్ వద్ద దుస్థితి

అప్పుడు సారా.. ఇప్పుడు టెట్రా

ఎన్నికల వేళ ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: ఎన్నికలు వస్తే చాలు గతంలో కర్ణాటక ప్రాంతం నుంచి కుప్పలు తెప్పలుగా సారా ప్యాకెట్లు తెచ్చి ఓటర్లకు పంచేవారు. అక్కడ సారా ప్యాకెట్ ఒక్కోటి రూ. 5లు నుంచి రూ. 7లు వరకు ఉండేది. అందుకే ఓటింగ్‌కు కొన్ని రోజుల ముందుగానే అభ్యర్థులు వాటిని తెప్పించి డంప్ చేసుకునేవారు. పోలింగ్ ముందు రోజు, లేదా పోలింగ్ రోజు వాటిని ఓటర్లకు పంచేవారు. ఈక్రమంలో ఆంధ్రా ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్నాయంటే కర్ణాటకలో మద్యానికి మంచి డిమాండ్ ఉండేది. సరిహద్దు ప్రాంతాలైన పెద్దపల్లి, కొత్తకోట, పావగడ, టుంకూరుకు వెళ్లి ముందుగానే సారా ప్యాకెట్లు తెప్పించేవారు. అయితే మన రాష్ట్రంలో సారాను నిషేధించడంతో వాటి స్థానంలో ప్రస్తుతం టెట్రా ప్యాకెట్లు వస్తున్నాయి. కర్ణాటక నుంచి ఆంధ్ర సరిహద్దు నియోజకవర్గాలకు కుప్పలు తెప్పలుగా టెట్రా ప్యాకెట్లు తెప్పించుకుంటున్నారు. ఇక్కడి మద్యం ధరల కంటే కర్ణాటక టెట్రా ప్యాకెట్ల ధరలు తక్కువగా ఉండటమే డిమాండ్‌కు ప్రధాన కారణం. ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాల్లో టెట్రా ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది.

65 ఏళ్ల తర్వాత ఊళ్లోనే ఓటు


మరుట్ల 1వ కాలనీ గ్రామంలోని పాఠశాల

కూడేరు, ఏప్రిల్ 24 : ఆ గ్రామ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే దాదాపు 3 కిలోమీటర్లు నడవాల్సి వచ్చేది. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో ఆ గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో వారికి నడక కష్టాలు తప్పాయి. కూడేరు మండలం మరుట్ల 1వ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తుండడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 65 సంవత్సరాల క్రితం పెనకచెర్ల డ్యాం నిర్మాణం చేపట్టగా, అక్కడ నివాసమున్న ప్రజలకు ప్రభుత్వం పునరావాసం కింద మూడు ప్రదేశాల్లో స్థలాలు కేటాయించింది. వీటికి మరుట్ల 1, 2, 3వ కాలనీలుగా పేర్లు పెట్టారు. గ్రామానికి గ్రామానికి మధ్య దాదాపు మూడు కిలోమీటర్లు దూరం ఉంది. మరుట్ల 1వ కాలనీ, 2వ కాలనీ ఓటర్లకు 2వ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో మరుట్ల 1వ కాలనీ వాసులు ఓటు వేయడానికి 2వ కాలనీకి వెళ్లాలంటే వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పోలింగ్ కేంద్రాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని 1వ కాలనీ వాసులు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం మరుట్ల 1వ కాలనీలో 952 మంది ఓటర్లు ఉండగా, అందులో 478 మంది పురుషులు, 472 మంది మహిళలు ఉన్నారు. తమ గ్రామంలోనే ఓటు వేసుకోనే అవకాశం 65 ఏళ్ల తర్వాత వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టెండర్, చాలెంజ్ ఓటు అంటే..



ధర్మవరం, ఏప్రిల్ 24: ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియలో టెండర్ ఓటు, చాలెంజ్ ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. టెండర్ ఓటు అంటే ఏమిటి? చాలెంజ్ ఓటు అంటే ఏమిటి? ఎలాంటి పరిస్థితుల్లో ప్రిసైడింగ్ అధికారి ఇలాంటి ఓటు వేసేందుకు అనుమతిస్తారో తెలుసుకుందాం.


చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి అసలైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంటుకు అనుమానం వస్తే అతడి గుర్తింపును ప్రశ్నించవచ్చు. రూ.2 ప్రిసైడింగ్ అధికారికి ఫీజుగా చెల్లించి దీనిపై విచారణ కోరవచ్చు. అప్పుడు సంబంధిత ఓటరును ధ్రువీకరణ కోసం తగిన ఆధారాలు చూపించాలని కోరుతారు. ఈ విచారణలో అతను అసలైన ఓటరే అని నిర్ధారణ అయితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఇలా చేయడాన్ని చాలెంజ్ చేసే హక్కు(రైట్ టుచాలెంజ్) అంటారు. ఒక వేళ అసలైన ఓటరు కాదని తెలితే ప్రిసైడింగ్ అధికారి అతడిని పోలీసులకు అప్పగించే అవకాశం ఉంది.


టెండర్ ఓటు

ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తికి తన ఓటును అప్పటికి ఎవరో వేసినట్లు తేలితే అతడికి టెండర్ ఓటు వేసేందుకు వీలుంటుంది. టెండర్ ఓటు కోసం ఓటరు అడిగినప్పుడు ప్రిసైండింగ్ అధికారి అతడికి ఒక బ్యాలెట్‌పేపర్ ఇస్తారు. ఓటు వేసిన తరువాత దీన్ని ఒక కవరులో ఉంచిసీల్ చేసి భద్రపరుస్తారు. టెండర్ ఓటును ఈవీఎంలో వేయడం సాధ్యం కాదు.

గంపెడు మట్టి వేసి ఉంటే..


కంకర తేలిన వెంకటాపురం రహదారి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 24: వైసీపీ ఐదేళ్ల పాలనతో గుంతలు పడ్డ రోడ్డుపై తట్టెడు మట్టి వేసి ఉన్నా ఇంత అధ్వానంగా ఉండేవి కావని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రం నుంచి నారప్పగారిపల్లి, వెంకటాపురం, తుమ్మలకుంట్లపల్లి మీదుగా వెళ్లే రహదారి కొన్నేళ్లుగా కంకర తెలి ఉంది. దీనిపై ప్రయాణమంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పుడు ఎలక్షన్ టైం వచ్చింది మా సత్తా చూపిస్తామంటూ హెచ్చరిస్తున్నారు.


కళ్యాణదుర్గానికే తలమానికంగా మారిన అక్కమాంబ దేవత ఈ కొండలోనే వెలసినది

నియోజకవర్గ చరిత్ర

- ముగ్గురు మంత్రులు పాలించినా ఉపాధి శూన్యం
- బెంగళూరుకు నిత్యం వలసలు
- వ్యవసాయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు
- హార్టికల్చర్ హబ్‌గా రికార్డుల్లోకి ఎక్కిన కళ్యాణదుర్గం

స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించిన కళ్యాణదుర్గం ప్రాంతం సమరయోధుల పుట్టినిల్లుగా ఖ్యాతిగడించింది. పూర్వం నుంచి పోరాటాలకు, చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ఎంతమంది నేతలు వచ్చినా అభివృద్ధిలో ఇంకా వెనుకబడే ఉంది. సరైన ఉపాధి అవకాశాలు లేక ఇక్కడి నుంచి కూలీలు నిత్యం కర్ణాటకకు వలసలు వెళుతుంటారు. వ్యవసాయ రంగంలో నియోజక వర్గానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఉద్యాన పంటలు పండించడంలో ఇక్కడి రైతులు అగ్రభాగాన ఉంటారు. అందుకే హార్టికల్చర్ హబ్‌గా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి గుర్తింపు ఉంది.

సమరయోధుల దుర్గం



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: కళ్యాణదుర్గం అనే పేరు 16వ శతాబ్దంలో పాలెగర్ బోయ కళ్యాణప్ప నుంచి కళ్యాణదుర్గం అనే పేరు వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. తరువాత బ్రిటిష్ పరిపాలన 1893 లో మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడదీసి ప్రత్యేకంగా కళ్యాణదుర్గం తాలూకాను ఏర్పరిచారు. చోళ రాజులు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి మండలాలను పరిపాలించారు. ఈ ప్రాంతంలో చెరువులు, దేవాలయాలు కూడా నిర్మించారు. కంబదూరులో చోళ రాజులు 13 వ శతాబ్దంలో మల్లేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటికి 1500 జనాభాతో ఏర్పడిన పట్టణం క్రమంగా విస్తరించి 2011 జనాభా లెక్కల ప్రకారం 30 వేలు జనాభా ఉన్నా, నేటికి ఆ సంఖ్య కనీసం దాదాపు 60 వేలకు దాటిపోయింది. చిన్న గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మేజర్ పంచాయతీ, తరువాత 2012లో మున్సిపాలిటీగా కళ్యాణదుర్గం రూపాంతరం చెందింది.

టీడీపీ కంచుకోట

తెలుగుదేశం పార్టీకి కళ్యాణదుర్గం కంచుకోట అనే పేరు ఉంది. ఇక్కడ బీసీ ఓట్లు అధికంగా ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు టీడీపీ వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ఐదుసార్లు టీడీపీ అభ్యర్థులు విజయాన్ని సాధించారు. టీడీపీ అభ్యర్థులే అత్యధిక మెజార్టీ సాధించారు. 1987, 1994, 1999, 2004, 2014 లో టీడీపీ అభ్యర్థులే విజయాన్ని సాధించారు.

పోరాటాల పురిటిగడ్డ

స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయులపై ఎదురుదాడి చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ఈడిగ ఓబయ్య అలియాస్ ఇండియా ఓబయ్య కళ్యాణదుర్గం ప్రాంతానికి ఒక మార్గదర్శిగా చెరగని ముద్ర వేసుకున్నారు. 1918 జూలై 17న వ్యవసాయ కుటుంబంలో పాపన్న, లింగమ్మ దంపతులకు ఓబయ్య జన్మించారు. స్వగ్రామం కంబదూరులో పాఠశాల చదువు పూర్తి చేసి 1935-1937 లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. అదే సమయంలోనే కంబదూరులో దళితులు చదువుకోవాలన్న ఉద్దేశంతో పాఠశాల ప్రారంభించారు. 1941లో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో హిందీ నరసప్ప, శెట్టూరు నారాయణశర్మ, ఉమాదేవి, గంగవరం క్రిష్ణమూర్తి ప్రధాన అనుచరులు అరెస్టయ్యారు. శెట్టూరు మండలం ఐదుకల్లు సదాశివన్ స్వాతంత్ర్య సమరయోధుడిగా చెరగని ముద్ర వేశారు. బ్రిటీష్ పోలీసుల పైశాచిక చర్యలకు ఎదురుతిరిగి కొన్ని సంవత్సరాలు బళ్లారి సెంట్రల్ జైల్లో గడిపారు. కళ్యాణదుర్గం, కదిరి ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారీ వ్యతిరేక పోరాటాలను కొనసాగించారు. ఈయన ఆశయాలను తెలుసుకున్న గాంధీజీ 1934 లో మచిలీపట్టణానికి వచ్చిన సందర్భంగా దగ్గరికి పిలిచి అభినందించారు.

బీసీలే అధికం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువగా బీసీ కులాలే అధికంగా ఉన్నారు. బోయ 48,377 మంది, గొల్ల 28,301, కురుబ 29,483, ఈడిగ 1,097, చేనేత 2,909, వడ్డె 3,000, కుమ్మరి 1,704, కమ్మరి 1,110, చాకలి 1,010, కంసలి 903, లింగాయతులు 5,063 మంది ఉన్నారు. బీసీలే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం 1,22,957 మంది ఉన్నారు. బీసీ ఓటర్లే ప్రతి ఎన్నికల్లోను కీలకంగా మారనున్నాయి.

2012 మార్చిలో మున్సిపాలిటీగా మార్పు

2012లో మంత్రి రఘువీరారెడ్డి హయాంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీగా ఏర్పాటైంది. దాంతో పాటు కళ్యాణదుర్గానికి రైల్వే మార్గం, అవుటర్ రింగ్, రెవెన్యూ డివిజన్, డీఎస్పీ కార్యాలయాలు, రూరల్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. మున్సిపాలిటీ మార్పు చెందడంతో రియల్ ఎస్టేట్ వేగం పుంచుకుంది.

తొలి ఎమ్మెల్యే నారాయణప్ప సంద

కళ్యాణదుర్గం నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా నారాయణప్ప సంద కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. ఆయన తన ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి బి.ఎర్రిస్వామిపై 8,476 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తొలి శాసనసభ్యుడిగా నారాయణప్ప 1952 లో ఎన్నికైయ్యారు.

దుర్గానికే తలమానికం అక్కమాంబ ఆలయం

కళ్యాణదుర్గానికే తలమానికంగా నిలిచింది అక్కమాంబ దేవాలయం. అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలలో అక్కమాంబ జాతరను నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అక్కమాంబ దేవత ఈ కొండలో వెలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నారు. అక్కమాంబ దేవత ఆకారంలో కొండ కనిపిస్తోందని ఇక్కడ భక్తుల్లో అపారమైన నమ్మకం ఉంది. కంబదూరులో మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని 13వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించారు. ఆరు అడుగుల శివలింగం, లేచి వచ్చే విధంగా ఉన్న నందీశ్వరుడు, నాలుగు రాతి స్తంభాలు, కోనేరు బావి, అందమైన శిల్పాలు ఈ దేవాలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రతి ఏటా మార్చిలో జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షిస్తే కళ్యాణం జరుగుతుందని ఇక్కడి భక్తుల్లో అపారమైన నమ్మకం ఉంది. 2012 లో మంత్రి రఘువీరారెడ్డి మంత్రిగా, సీడబ్ల్యూసీ మెంబర్‌గా పనిచేసిన లక్ష్మీదేవమ్మ పేరుతో కృషి విజ్ఞానకేంద్రాన్ని కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు.

వ్యవసాయంలో జాతీయ గుర్తింపు

వ్యవసాయ రంగంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కర్బూజ, కళింగర, టమోటా, మామిడి, చీనీ, బొప్పాయి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, సపోట, వేరుశనగ తదితర పంటలను పడించడంలో ఇక్కడి రైతులు పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కంబదూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో ఈ పంటలను సాగు చేసే రైతులు చాలా మంది ఉన్నారు. సేంద్రియ ఎరువులతో కూడా పంటను పండించి ఆదర్శ రైతులుగా నిలిచారు. జిల్లాలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యవసాయంలో టాప్‌గా నిలిచింది. టీడీపీ హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా ఎంపిక చేశారు. ఆదర్శ రైతులను ఎంపిక చేసి అవార్డులను కూడా అందచేశారు.

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1962	హిందీ నరసప్ప	కాంగ్రెస్	బి.రామప్ప	ఇండిపెండెంట్	3,120
1967	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	పక్కీరప్ప	సీపీఐ	6,469
1972	ఎం. లక్ష్మీదేవి	కాంగ్రెస్	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	15,721
1978	హిందీ నరసప్ప	జనతాపార్టీ	ఎస్.విశ్వనాథం	కాంగ్రెస్	3,427
1983	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	ఎస్.విశ్వనాథం	కాంగ్రెస్	21,779
1985	పక్కీరప్ప	సీపీఐ	లక్ష్మీదేవి	కాంగ్రెస్	25,020
1987	బీసీ గోవిందప్ప	టీడీపీ	లక్ష్మీదేవి	కాంగ్రెస్	4,798
1989	లక్ష్మీదేవి	కాంగ్రెస్	సంజీవయ్య	సీపీఐ	4,742
1994	బీసీ గోవిందప్ప	టీడీపీ	ఎం. లక్ష్మీదేవి	కాంగ్రెస్	56,078
1999	ఎ. శారదాంబ	టీడీపీ	ఏబీ శాంతిశివాజీ	కాంగ్రెస్	22,882
2004	బీసీ గోవిందప్ప	టీడీపీ	ఉమాదేవి	కాంగ్రెస్	9652
2009	రఘువీరారెడ్డి	కాంగ్రెస్	హనుమంతరాయచౌదరి	టీడీపీ	4,388
2014	హనుమంతరాయచౌదరి	టీడీపీ	బి.తిప్పేస్వామి	వైసీపీ	22319
2019	ఉషశ్రీచరణ్	వైసీపీ	ఉమామహేశ్వరనాయుడు	టీడీపీ	19,896

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

బ్రహ్మసముద్రం మండలంలో పురుషులు 17,241 మంది, మహిళలు 17055 మంది మొత్తం 34,297 మంది ఓటర్లు ఉన్నారు. కళ్యాణదుర్గం అర్బన్‌లో పురుషులు 17,311, మహిళలు 18506, ఇతరులు ఒకరు మొత్తం 35818 మంది ఓటర్లు ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్‌లో పురుషులు 19,044 మంది, మహిళలు 18,924 మంది, ఇతరులు ఇద్దరు మొత్తం 37,970 మంది ఉన్నారు. శెట్టూరు మండలంలో పురుషులు 16,961, మహిళలు 16,831, ఇతరులు ఒకరు మొత్తం 33,793 మంది ఓటర్లు ఉన్నారు. కుందుర్పి మండలంలో పురుషులు 21,757 మంది, మహిళలు 21,567, ఇతరులు ఒకరు మొత్తం 43,325 మంది ఉన్నారు. కంబదూరు మండలంలో పురుషులు 20,881, మహిళలు 21,353, ఇతరులు ఒకరు మొత్తం 42,235 మంది ఓటర్లు ఉన్నారు.

కళ్యాణదుర్గంలో ప్రధాన సమస్యలు

కళ్యాణదుర్గం ప్రజలను అడుగడుగునా సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణంలో దాదాపు 60 వేల మంది జనాభా వుంది. ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా వుంది. ఈ సమస్య ఐదేళ్ల కాలంలో మరీ దారుణంగా తయారైంది. కాలనీలో ఉన్న మురుగునీరు ప్రధాన రహదారులపైకి వస్తోంది. దీనికి తోడు డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో పాలకులు విఫలమవుతున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ వుండటంతో దోమలు, పందుల బెడద ఎక్కువగా వుండటంతో ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సమస్య మరీ ఘోరంగా ఉంది. పట్టణ, గ్రామాలకు సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి నీళ్లు వస్తున్నాయి. పట్టణంలో శ్రీరామ్‌రెడ్డి నీటి పైపులు తరచూ పగిలిపోతుండడంతో తాగునీరు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ప్యూరిఫైడ్ నీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడినది. కొన్ని గ్రామాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యను బహిరంగంగానే తాగు నీటి సమస్య వుందని అడ్డుకున్న సందర్భాలు కోకొల్లలుగా వున్నాయి. అలాగే ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్డు ఎక్కిన పరిస్థితులు కూడా ఉన్నాయి. రహదారులు పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని రహదారులు కూడా నియోజకవర్గంలో దర్శనమిస్తున్నాయి. మంత్రి ఉషశ్రీచరణ్ ప్రచారానికి వెళ్లినప్పుడు కూడా కుందుర్పి మండలంలో కాన్వాయ్ వెళ్లలేని పరిస్థితుల్లో అతి కష్టం మీద ద్విచక్ర వాహనంపై వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. పట్టణంలో రోడ్ల విస్తీర్ణంలో భాగంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుంది. వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి అనేక సమస్యలతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు.


పట్టణంలోని ఎర్రనేల వీధిలో పారుతున్న మురుగు నీరును చూపిస్తున్న మహిళలు

ముగ్గురు మంత్రులను ఇచ్చినా అభివృద్ధి శూన్యం

లక్ష్మీదేవమ్మ, రఘువీరారెడ్డి, ఉషశ్రీచరణ్ నియోజకవర్గం నుంచి మంత్రులుగా పనిచేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన లక్ష్మీదేవమ్మ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కంబదూరులోనే ఐసీడీయస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడి నుంచి కార్యకలాపాలు ఎక్కువగా సాగేవి. రెవెన్యూశాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి హయాంలో అవుటర్ రింగు రోడ్డు, రైల్వే లైన్, కార్యక్రమాలను చేపట్టారు. అయినా ఇక్కడ ఏ మాత్రం ఉపాధి అవకాశాలు లేవు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి సుమారు 20 వేల మందికి పైబడి ఉపాధి కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు సంవత్సరాల పొడవునా వలసలు వెళుతుంటారు.

1951లో నియోజక వర్గంగా మార్పు

1951లో కళ్యాణదుర్గం నియోజకవర్గంగా మార్పు చెందింది. ఈ నియోజకవర్గం 4,42,694 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. జనాభా 3,15,577 మంది ఉన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 2,27,438 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,13,195 మంది, మహిళలు 1,14,236 మంది ఉన్నారు. థర్డ్ జెండర్స్ 7 మంది ఉన్నారు. 1952 నుంచి 2019 వరకు 13 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థిగా బీసీ గోవిందప్ప 1994లో 56,078 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ తరఫున హిందీ నరసప్ప 1962లో 3,120 ఓట్ల అత్యల్ప మెజార్టీతో గెలుపొందారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగు, తాగు నీటిని అందించాలి. దాంతో పాటు నియోజకవర్గంలో వలసలు నివారించి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. టమోటా ప్రాసెసింగ్ యూనిట్, గ్రామీణ ప్రాంతాలకు రహదారి సౌకర్యంతో పాటు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి.

ప్రచార శబ్దానికి పరిమితులు



ధర్మవరం, ఏప్రిల్ 24: కేంద్ర ఎన్నికల సంఘం పరిమితుల మేరకే అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించాలి. ఎన్నికల ప్రచారంలో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలం తా పాటించాలి. మైకుల శబ్దాలతో హోరెత్తిస్తే చర్యలు తప్పవు. డీజేసౌండ్స్ పెద్ద పెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్దకాలుష్యం కింద కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏయే ప్రాంతంలో ఎంత శబ్దం అనుమతి స్తారనే వివరాలు ఇలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు జైలు శిక్ష పడే అవకాశముంది. ఆయాప్రాంతాల్లో ఉండాల్సిన శబ్ద తీవ్రత నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్దం చేయరాదు.

ఓటరు గుర్తింపు కార్డుకు 29 ఏళ్లు



ధర్మవరం, ఏప్రిల్ 24: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేం దుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరును గుర్తించేందుకు, నకిలీ ఓట్లను అరికట్టేందుకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 29 సంవత్సరాలు పూర్తయింది. ఓటరు జాబితాల్లో ఉన్న క్రమసంఖ్య ప్రకారం ఫొటోను కార్డుపై ము ద్రించి ఇస్తున్నారు. ఐడికార్డుపై స్టాంప్‌సైజు ఫొటో, జనన తేదీ, చిరునా మా సైతం ముద్రిస్తారు. సీరియల్ నంబరు, హోలోగ్రామ్ స్టిక్కర్, కార్డును జారీ చేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటాయి. దీనిపై ముద్రించిన సీరియల్ నంబరు చాలా ముఖ్యం. ఎన్నికల క మిషన్ ఓటరు జాబితా డేటాను ఆన్‌లైన్‌లో ఉంచడంతో ఓటరు ఎన్నికల సంఖ్య సీరియల్ నంబరును సులభంగా తెలుసుకుంటున్నారు. 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ ఈ ఓటర్ ఐడీ కార్డు అందజేస్తున్నారు. దీనిని ఇతర ప్రభుత్వపథకాలు పొందేందుకు, భారతీయ పౌరుడిగా గుర్తింపు కోసం, చిరునామా కోసం అధికారికంగా వినియోగించుకోవచ్చు.

బైక్‌లలో వైసీపీ శ్రేణుల హల్‌చల్

- గంటన్నరపాటు ట్రాఫిక్ జాం
- ఇబ్బందులు పడ్డ సత్యసాయి భక్తులు
- చోద్యం చూసిన పోలీసులు


ద్విచక్రవాహనంలో హల్‌చల్ చేస్తున్న వైసీపీ కార్యకర్తలు


హనుమాన్‌కూడలిలో కానరాని పోలీసులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 24: జిల్లాకేంద్రం పుట్టపర్తిలో వైసీపీ నాయకులకు ఒకచట్టం, ప్రతిపక్షపార్టీలకు ఒక చట్టం తీరుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాకేంద్రంలో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. నామినేషన్ల పర్వం కొనసాగుతున్న తరుణంలో ఈ నెల 18నుంచి పార్టీ జెండాలతో ద్విచక్రవాహనా లను ప్రధాన రహదారిలో అనుమతించడం లేదు. ఎవరైనా పొరపాటున ప్రధాన వీధుల్లో జెండాతో కానీ, జెండా కట్టుకుని వెళుతున్న ద్విచక్రవాహనాల్లో కానీ కనపడితే పోలీసులు రెచ్చిపోయేవారు. అయితే బుధవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ప్రధాన వీధుల్లో ద్విచక్రవాహనాలు, ఆటోల్లో కార్యకర్తలు పార్టీ జెండాలు కట్టుకుని హంగామా సృష్టించినా పోలీసులు చోద్యం చూశారు. దీనికి తోడు బుధవారం సత్యసాయిబాబా ఆరాధనోత్సవాలు సందర్భంగా హిల్‌వ్యూస్టేడియంలో పెద్దఎత్తున నారాయణసేవ, వస్త్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం వేలాది మంది భక్తులు స్టేడియం నుంచి రోడ్డుపైకి రావడం, వైసీపీ ప్రచారవాహనాలు, ద్విచక్రవాహనాలు, కార్యకర్తలను ప్రధాన రహదారిలోకి అనుమతించడంతో సుమారు గంటన్నరపాటు ట్రాఫిక్‌జాంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన పోలీసు సిబ్బంది ఎక్కడా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పుట్టపర్తిలో సత్యసాయి ఆరాధనోత్సవాల జరుగుతున్న సందర్భంలో పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై పట్టణవాసులు, భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్

ధర్మవరం, ఏప్రిల్ 24: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు బుధవారం 2,4,6 సెమిష్టర్ పరీక్షలను పట్టణంలోని కేహెచ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి(వైస్‌చాన్సలర్) ఆచార్య కె.హుస్సేన్‌రెడ్డి, కాలేజ్ డెవలప్‌మెంట్ కమిటి డీన్‌ప్రొఫెసర్ రాంగోపాల్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల్లో కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరిగేలా చూడాలన్నారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పరీక్షల విభాగం కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

పల్లె సింధూర కాన్వాయ్‌ను అడ్డుకున్న వైసీపీ కార్యకర్త

బుక్కపట్నం, ఏప్రిల్ 24: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి బుధవారం వెళ్తున్న పుట్టపర్తి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి కాన్వాయిని వైసీపీ కార్యకర్త అడ్డుకున్న ఘటన మండలంలోని గూనిపల్లిలో చోటుచేసుకుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పల్లె సింధూరరెడ్డి తన అనుచరులతో కలిసి ప్రచార నిమిత్తం మారాల గ్రామానికి వెళ్తుండగా గూనిపల్లి వద్దకు కాన్వాయి రాగానే మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త హరి తన బైక్‌ను కాన్వాయ్‌కు అడ్డంగా పెట్టి నానా హంగామా చేశాడు. అసహనానికి గురైన టీడీపీ కార్యకర్తలు హరిని పక్కకు నెట్టేసి ముందుకు వెళ్లారు. మండలంలో ప్రతిచోటా ఇదే విధంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు అనవసరంగా టీడీపీ ప్రచారాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించడం గమనార్హం.

రైతుల భూములు కాజేయడానికి వైసీపీ కుట్ర: సత్యకుమార్


విలేకరులతో మాట్లాడుతున్న సత్యకుమార్, పక్కన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 24: అవినీతి, భూదందాలకు అలవాటు పడిన వైసీపీ రైతుల భూములు కొట్టేయడానికి కుట్ర జీఓలు తీసుకువచ్చిందని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి సోలార్ మాటున బారీ భూ కుంభకోణానికి తెరతీశారని ఆరోపించారు. ముదిగుబ్బ మండలంలో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అనుమతి వచ్చిందని, అయితే అందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 6న చీకటి జీఓ తెచ్చి ప్రైవేటు భూములను కాజేసి రైతుల నోట్లో మట్టి కొట్టడానికి పన్నాగం పన్నారని అన్నారు. సోలార్ ముసుగులో ఇదొక భారీ మోసమన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. సత్యన్న నామినేషన్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులు, నాయకులు, నియోజకవర్గ ప్రజలు భారీ ఎత్తున తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రజాస్పందన చూసి ప్రత్యర్థి పార్టీకి వణుకు పుట్టిందన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు కమతం కాటమయ్య, కుమ్మర సాధికారిత రాష్ట్ర చైర్మన్ పోతలయ్య, జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, బీజేపీ నాయకులు అంబటిసతీశ్, జింకాచంద్ర, గుండాపుల్లయ్య,సాకేఓబులేశు పాల్గొన్నారు.

వార్డుల్లో సత్యకుమార్ ఎన్నికల ప్రచారం


ధర్మవరంలో ప్రచారం చేస్తున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం: పట్టణంలోని 36, 37, 38 వార్డులలో సత్యకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు వార్డుల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. సత్యకుమార్ వృద్ధులు, వికలాంగుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే సమస్యల్ని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అలాగే ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి సైకిల్ గుర్తుకు ఓటేయాలని సూచించారు. ధర్మవరంలో 50ఏళ్ల తరువాత బీసీ వర్గానికి చెందిన తనకు పోటీ చేసే అవకాశం లభించిందన్నారు. ఎన్నికలలో తనను ఆశీర్వదించి గెలిపిస్తే ధర్మవరం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాష్ట్రం నుంచే గాక కేంద్రం నుంచి సైతం నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అవినీతి రాజ్యమేలుతున్నాయన్నారు. ఇక వాటికి చెక్ పెట్టాలన్నారు. ఇందుకు కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్‌అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్రచౌదరి, టీడీపీ, బీజేపీ నాయకులు కమతం కాటమయ్య, గోనుగుంట్ల విజయ్‌కుమార్, ఫణికుమార్, పరిశేసుధాకర్, మాదనసుబ్బయ్య, బీజేపీ నాయకులు జింకాచంద్ర, సాకేఓబులేశు, జనసేన నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు జనం కరువు

- డబ్బులిచ్చినా ఆశించినస్థాయిలో రాని వైనం


నామినేషన్ ర్యాలీలో స్వల్పంగా ఉన్న వైసీపీ శ్రేణులు

ధర్మవరం, ఏప్రిల్ 24: ధర్మవరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామినేషన్‌కు అనుకున్న స్థాయిలో జనం రాలేదు. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. కేతిరెడ్డి తిక్కస్వామినగర్‌లోని శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 8-30గంటలకే ర్యాలీగా తరలివచ్చారు. అయితే జనం అనుకున్నంత మేర రాకపోవడంతో శ్రేణులపై తమ అసహనాన్ని వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. 2019లో నామినేషన్‌కు వచ్చిన అభిమానులతో బేరీజు చేసుకుంటే ఈ ఏడాది ఎన్నికల నామినేషన్‌కు జనం రాక భారీగా తగ్గిపోయినట్టు ఆ పార్టీ వర్గాలే బాహాటంగా వ్యక్తం చేశారు. అభ్యర్థి నామినేషన్ వేయడానికి ఆర్డీఓకార్యాలయంలోకి వెళ్లగానే వచ్చిన కాస్తా జనం కూడా జారుకున్నారు. దీంతో ఖాళీ రోడ్డు దర్శనమిచ్చింది .ఒక్కొక్కరికి రూ.500 డబ్బులిచ్చి పిలిపించుకున్నా.. చివరి వరకు జనాలు ఎందుకు ఉండనివ్వలేదంటూ ఆ ప్రజాప్రతినిధి శ్రేణులపై ఆగ్రహం వ్యక్త చేసినట్లు సమాచారం.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


పరిటాలశ్రీరామ్ సమక్షంలో పార్టీలోకి చేరిన సంగాల నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్24: బత్తలపల్లి మండలం సంగాల పంచాయతీ సంగాలతండా గ్రామానికి చెందిన 20కుటుంబాల వారు పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు పరిటాలశ్రీరామ్‌ను కలిసి పార్టీలోకి చేరారు. వారికి పరిటాల శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గోగులనారాయణస్వామి, గోగులశివయ్య, మంజులపుల్లయ్య, నరసింహులు, షేక్‌అల్లావుద్దీన్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, అమర్నాథ్‌చౌదరి, సురేంద్రనాయుడు, వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా ఫారం-12 అందించాలి: డీఈఓ

కొత్తచెరువు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఈనెల 26వ తేదీలోగా ఫారం-12ను రిటర్నింగ్ అధికారికి అందించాలని డీఈఓ మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పొందాలంటే తప్పనిసరిగా ఫారం-12ను రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. లేదంటే పోస్టల్ బ్యాలెట్ కోల్పోతారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగి ఫారం-12ను తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలి

కదిరి అర్బన్, ఏప్రిల్ 24 : త్వరలో జరిగే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌ల వినియోగం గురించి అవగాహన సదస్సును నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు బుధవారం రిటర్నింగ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఓ, ఏపీఓ, ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్‌లు వినియోగించుటకు బ్యాలెట్ పంపిణీ మండలాలవారీగా సిబ్బంది కేటాయించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందజేయాలని కోరారు. 2019సాధారణ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లు ఎక్కువగా ఇన్‌వ్యాలిడ్‌గా మారినందున ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 180 కుటుంబాల చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి


మారాలలో ప్రచారం చేస్తున్న పల్లె సింధూర రెడ్డి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 24: మండలంలోని మహ్మదాబాద్ క్రాస్‌లో బుధవారం 180 కుటుంబాల వారు బుధవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మహ్మదాబాద్‌క్రాస్, జెర్రికుంటపల్లితోపాటు అ మడగూరు మండలం జేకేపల్లి, ఓడీసీ మండలం నందివారిపల్లి తదితర గ్రామాలకు చెందిన 180 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం లో ముఖ్యమంత్రి జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు స్వస్తి పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో ప్రజలు అనేక ఇ బ్బందులు పడ్డారన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డి, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించుకోవాల ని పిలుపునిచ్చారు. టీడీపీలోకి చేరిన వారి లో నందివారిపల్లి నరసింహులు, ఆం జనేయులు, బైరిశెట్టి, ఓడిగల క్రిష్ణమూర్తి, జి. లక్ష్మయ్య బోనాల ఆచారి తదితరులు ఉన్నా రు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుల్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, శ్యామ్‌బాబు నాయుడు, నిజాం, కంచిసురేష్, కందుకూర్లపల్లి కృష్ణమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, కార్యదర్శి కొండబోయిన సతీష్, మహిళా సంఘం నాయకులు మస్తానమ్మ, అఖిల, జ్యోతి, భాగ్యమ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

బుక్కపట్నం: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మారాల, యాదాలంకపల్లి, కృష్ణాపురం తదితర గ్రామ పంచాయతీలలో బుధవారం ఆమె టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు, పార్టీల నాయకులు పూలవర్షం కురిపిస్తూ బాణాసంచా కాలుస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమిని అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయలు

బత్తలపల్లి, ఏప్రిల్ 24: మండల కేంద్రలోని దర్మవరం రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డరు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిమర్రి మండలం పిన్నదర్రి గ్రామానికి చెందిన భాస్కర్, సావిత్రి బైక్‌పై ధర్మవరం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే బత్తలపల్లిలోకి రాగానే వెనక వస్తున్న బొలెరో వాహనానికి బ్రేకులు ఫెయిల్ అవడంతో బైక్‌ను ఢీ కొంది. భాస్కర్, సావిత్రి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

ఎస్పీని కలసిన ఎన్నికల అబ్జర్వర్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు నియమించిన పోలీసు ఎన్నికల అబ్జర్వర్లు నాగాలాండ్‌కు చెందిన ఇమ్నాలెన్సా అన్యూకుమార్‌లు జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని స్థానిక సత్యం రిసార్ట్‌లో బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం జిల్లాలో జరిగే ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

గిరిజన తండాల్లో కందికుంట ప్రచారం


గేమేనాయక్ తండాలో ప్రచారం చేస్తున్న కందికుంట


మూడోవార్డులో ప్రచారం చేస్తున్న యశోదాదేవి

తనకల్లు, ఏప్రిల్ 24: మండల పరిధిలోని గేమేనాయక్ తండా పంచాయతీలోని అద్దానంపల్లి, రతినేనాయక్‌తాండా, కమటంపల్లి, బుడ్డయ్యకోట, తులసేనాయక్ తండా, నాయన చెరువుపల్లి, మూటిచింతమాను తండా, పోమేనాయక్ తండా, గద్దలబండ తండా, వేపలపల్లి గ్రామాలతోపాటు తవళం గ్రామ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో బుధవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. గిరిజన తండాలలో కందికుంటకు గిరిజనులు అపూ ర్వ స్వాగతం పలికారు. కందికుంట ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వా టిని అమలు చేస్తారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. గిరిజన కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది వైసీపీనేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బీగం శంకర్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, గేమేనాయక్ తండా సర్పంచ్ కాంతమ్మ, జనసేన నాయకులు రమణ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన దళితులు

తనకల్లు: మండలంలోని గుర్రంబయలు గ్రామానికి చెందిన దళితులు బుధవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో రతినేనాయక్‌తండాలో టీడీపీలోకి చేరారు. బాబేనాయక్ తండాకు చెందిన బాలాజీనాయక్ ఆధ్వర్యంలో దళితులు తెలుగుదేశంలో చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో దళిత నాయకులు ఎట్టి యర్రన్న, ఎట్టి కిష్టప్ప, తలారి చిన్నవెంకటరమణ, రామాంజి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగమల్లు, బ్రహ్మానందరెడ్డి, శివరాం, శీనానాయక్, శంకర్‌నాయక్, నాగభూషణ్‌నాయక్, రెడ్డప్పనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణుల చేరిక

గాండ్లపెంట: వైసీపీ మాజీ మండల కోఆప్షన్ మెంబర్ సికిందర్ టీడీపీలోకి చేరారు. మండలకేంద్రంలో బుధవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనతో పాటు ఫకృద్దీన్, జహీర్, తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నాయకులు అక్రం, పవన్, చంద్ర, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం..

కదిరి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. తొలుత సైదాపురం అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేపట్టారు. తర్వాత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. కూటమి గెలుపునకు కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూడో వార్డు ఇన్‌చార్జి కొమ్మినేని గంగయ్య నాయుడు, నాయకులు కొమ్మినేని కల్పన, గుత్తా గోపాల్ నాయుడు, బండారు మనోహర్ నాయుడు, కొయ్య రాజేంద్ర నాయుడు, శ్రీనివాసులు, పాలినేని శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు


వైష్ణవి చర్మిళ రిషిత కార్తీక్ గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మా ట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

వైసీపీకి మద్దతుగా వలంటీర్ల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు


నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న నడిమిగడ్డపల్లి వలంటీర్ బొజ్జేనాయక్

ధర్మవరంరూరల్, ఏప్రిల్24: మండలంలోని దర్శినమల గ్రామంలో వలంటీర్లు రామ్మోహన్, చంద్రశేఖర్, అక్కులప్ప, పోతలయ్యలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఓటు వేయాలని స్థానిక నాయకులతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా బుధవారం ఎమ్మెల్యే నామినేషన్‌కు రావాలని ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించారు. నడిమిగడ్డపల్లికి చెందిన వలంటీర్ బొజ్జేనాయక్ ఎమ్మెల్యే నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంకా కొంతమంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ తమ స్వామి భక్తి ని చాటుకుంటున్నారు. ఆ వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలకన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, నాయకు లు జంగం నరసింహులు, ధనుంజయ, చెన్నప్ప, పవన్, రమణలు కలిసి ఎంపీడీఓ కార్యాలయపు అధికారికి ఆధారాలతో వినతిపత్రం అందించారు. ఈసీ ఆదేశాలను ఉల్లంఘించిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మైనార్టీల ద్రోహి సీఎం జగన్

నల్లచెరువు, ఏప్రిల్ 24 : మైనార్టీల ద్రోహి సీఎం జగన్ అని, ఆయన్ను త్వరలోనే ఇంటికి సాగనంపాలని టీడీపీ మైనార్టీల నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బషీర్ స్వగృహంలో బుధవారం వారు సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ మైనార్టీ మండల అధ్యక్షుడు షాకీర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. పలువురు మాట్లాడుతూ జగన్ మైనార్టీలకు చేసింది శూన్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లిం మైనార్టీలకు దుల్హన్‌పథకం, విదేశీ విద్య, ఇమాం, మౌజాన్‌లకు గౌరవవేతనం, రంజాన్ తోఫా, హజ్ భవనం, ముస్లిం మైనార్టీల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, షాదీఖానా మరమ్మతులు, మసీదు మరమ్మతులు తదితరాలు చేపట్టారన్నారు. అదే వైసీపీ పాలనలో అభివృద్ధి ఎక్కడచేశారో చూపించాలని సవాల్ విసిరారు. మైనార్టీలందరూ కలిసి జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బషీర్‌అహ్మద్, మాజీ ఎంపీపీ మహబూబ్‌సాబ్, మహ్మద్, అల్లాబకాష్, హుస్సేన్‌ఖాన్, ఫిరోజ్, బాబాజి, హైదర్‌వలి, నజీర్, బాబాఫకృద్దీన్ ఇస్మాయిల్, పీరుసాబ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కొల్హాపురమ్మకు హారతులు

రొళ్ల, ఏప్రిల్ 24: మండలం రత్నగిరిలో వెలిసిన శ్రీ కొల్హాపురి మహాలక్ష్మీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హారతులు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర ప్రాంతం నుంచేకాక సమీప కర్ణాటక ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణలు చేసి హారతులు నిర్వహించారు.

మేము సైతం సాయిసేవలో..

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 24: సత్యసాయి బాబా ఆరాధనోత్సవాల్లో భాగంగా మేము సైతం సాయిసేవలో అంటూ పర్తివాసులు పెద్దఎత్తున పట్టణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సత్యసాయి బాబా 13వ ఆరాధనోత్సవాల సందర్భంగా పుట్టపర్తికి విచ్చేసిన సాయిభక్తుల కోసం పట్టణంలో హనుమాన్ సర్కిల్, బస్టాండ్, గోపురంవీధి, వాసవీనివాస్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ముదిగుబ్బ: సత్యసాయి ఆరాధనోత్సవాల సందర్భంగా మండలకేంద్రంలో సత్యసాయి భోజన మండలి సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం పేదలు, వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు అంబటి చలపతి, కృష్ణవేణి, వాసు, టీవీ మహేష్, సూరి, మాధవి, శ్రీవల్లి, లీల , జయశ్రీ, మాధవి, సంగీతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కొల్హాపురి అమ్మవారు

ఘనంగా కొల్హాపురమ్మకు హారతులు

రొళ్ల, ఏప్రిల్ 24: మండలం రత్నగిరిలో వెలిసిన శ్రీ కొల్లాపురి మహాలక్ష్మీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హారతులు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర ప్రాంతం నుంచేకాక సమీప కర్ణాటక ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణలు చేసి హారతులు నిర్వహించారు.



హారతులు మోస్తున్న భక్తులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

గోరంట్ల, ఏప్రిల్ 24: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఓ సూర్యనారాయణ, ఈఓఆర్డీ సుధాకర్, మండల పరిషత్ సిబ్బంది నవీన్, నిరంజన్‌రెడ్డి, సతీష్‌కుమార్, హరి, అంజి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

చర్యలు తీసుకోండి: ఎస్ఎఫ్ఐ



డిప్యూటీ డీఈఓ రంగస్వామికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 24: నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు జరిపే కాలేజీలపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయ కులు గురువారం పెనుకొండకు వెళ్లి డిప్యూటీ డీఈఓ రంగస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు అడ్మిషన్ల షెడ్యూల్ విడదల కాకముందే నిబంధనలు తుంగలో తొక్కి అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. అలాంటి కళాశాలలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే విద్యార్థులతో కలిసి టువంటి కళాశాలల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించా రు. ఈ సమస్యను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకలు రమేశ్, అనిల్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మడకశిరటౌన్, ఏప్రిల్ 24: వచ్చే నెలలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలు మడకశిర నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకారం అందించాలని మడకశిర టౌన్ సీఐ మనోహర్, రూరల్ సీఐ రాజ్‌కుమార్ కోరారు. సీఐల ఆధ్వర్యంలో బుధవారం మడకశిర పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఎన్నికల సంద ర్భంగా నామినేషన్‌లు, ప్రచారాలు నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావు లేకుండా ప్రశాంతంగా సాగించాలని సూచించారు. ప్రజలకు ధైర్యం కలిగిస్తూ... నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకారం అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐలు, బీఎస్ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గడ్డివాములకు నిప్పు

గోరంట్ల, ఏప్రిల్ 24: మండలంలోని కమ్మవారి పల్లిలో రెండు గడ్డివాములు బుధవారం పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ. 30వేలు ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు అరవ శీను తెలిపాడు. గ్రామానికి చెందిన బండారు వెంకటేష్ పొలాన్ని కౌలురైతు అరవ శీన సాగుచేస్తున్నాడు. బోరుబావి కింద పండించిన వేరుశెనగ, వరి పశుగ్రాసాన్ని విడివిడిగా వాములుగా వేసి నిలువ ఉంచారు. పాడి పశువుల కోసం భద్రపరిచిన ఆ వాములకు గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. మొక్కజొన్న గడ్డివాము కొంత దూరంలో ఉండటంతో ప్రమాదం తప్పిందన్నాడు.

ఇండోర్ స్టేడియం ఆగిపోయింది..!

- టీడీపీ హయాంలో 90 శాతం నిర్మాణం
- వైసీపీ పాలనలో పూర్తికాని పదిశాతం పనులు
- నిరాశలో మడకశిర క్రీడాకారులు



అర్ధంతరంగా ఆగిన ఇండోర్‌స్టేడియం నిర్మాణం

మడకశిర టౌన్, ఏప్రిల్ 24: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానం లో ఇండోర్ స్టేడియం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపో యింది. దీంతో తమ ప్రతిభ చాటుకునేందుకు మంచి అవకాశం వచ్చిందని ఆశ పడిన మడకశిర క్రీడాకారు ఆశలు అడియాశలయ్యాయి. ఉమ్మడి జిల్లాలోనే మారు మూల ప్రాంతమైన మడకశిరలోని పాఠశాలలు, కళా శాలలకు సరైన క్రీడా మైదానాలు లేవు. దీంతో క్రీడాకా రులు తమ ప్రతిభను చాటు కునేందుకు ఇబ్బందులు పడేవారు. ఇలాంటి తరుణంలో అప్పటి టీడీపీ ప్రభు త్వం మడకశిరకు ఇండోర్ స్టేడియం మంజూరుచేసిం ది. అప్పట్లో రూ.2 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో ఈ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలాగే నిపుణులైన కోచ్‌లను నియమించి అవసరమైన క్రీడాసామాగ్రిని సమకూర్చితే ఇక్కడి క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించేందుకు అవకాశముందని భావించారు. ప్రతిభను చాటుకునేం దుకు మంచి అవకాశం ఏర్పడుతోందని ఇక్కడి క్రీడాకారులు ఆశ పడ్డారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి అయితే చెస్, క్యారమ్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో నైపుణ్యం సాధించే అవకాశం ఉంది. దీంతో పాటు ఇండోర్ స్టేడియం ఆవరణంలో విశాలమైన క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్‌రేస్ వంటి ఎన్నో క్రీడలు ఆడేందుకు అవకాశం ఉండేది. క్రీడల్లో మంచి నైపుణ్యం పెంపొందించుకునే యువతకు ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉండడంతో ఈ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని యువత, ప్రజలు ఎంతో సంతోషించారు. ఇండోర్‌స్టేడియం నిర్మాణం ఈ ప్రాంత క్రీడాకారులకు అదృష్టంగా భావించారు. స్థానిక క్రీడాకారుల కల నెరవేర్చేందుకు నిధులు మంజూరు చేసి, శరవేగంగా దాదాపు 90శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. మిగిలిన కేవలం 10శాతం పనులు పూర్తి చేయలేకపోవడంతో స్టేడియం నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. దీంతో మడకశిర నియోజకవర్గంలోని క్రీడకారుల ఆశ నేరవేరలేదు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: బాలకృష్ణ



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 24: మారుతున్న కాలానుగుణంగా భవిష్యత్తు తరాలకు మనం వనాలు తెచ్చి ఇవ్వాలని సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన బుధవారం మండలపరిధిలోని సడ్లపల్లివద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ రాను రాను వనాలు తగ్గిపోతున్నాయని, అడవులు కరిగిపోతున్నాయన్నారు. వర్షాలు రాక ఉష్ణోగ్రత్తలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇలాగే అయితే భవిష్యత్తు తరాలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లు, పొలాలవద్ద విరివిగా చెట్లు పెంచాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, పట్టణాధ్యక్షుడు రమేష్, నాయకు లు చంద్రమోహన్, హెచ్‌ఎన్ రాము, బేవనహళ్లి ఆనంద్, లింగారెడ్డి, ఆదినారాయణ, వెంకటనారాయణ, రామప్ప, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ

హిందూపురం/ లేపాక్షి: కొంతకాలం కిందట మృతిచెందిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పరామర్శించారు. నారాయణరెడ్డి ఇంట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ హయాం నుంచి మృతిచెందేవరకు పార్టీ వెంటే ఉన్నాడని ఆయన లేనిలోటు పార్టీకి తీరనిదన్నారు. మీ కుటుంబానికి భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే లేపాక్షి మండలంలోని మాజీ జడ్పీటీసీ నాయనపల్లి ఆదినారాయణరెడ్డి కుటుంబాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ బుధవారం పరామర్శించారు. నాయనపల్లిలోని ఆదినారాయణరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదినారాయణరెడ్డికి కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు.

బాలకృష్ణకు మద్దతుగా భారీగా ఎన్నికల ప్రచారం

చిలమత్తూరు: టీడీపీ కూటమి హిందూపురం నియోజకవర్గ ఎమ్మె ల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణకు మద్దతుగా భారీ జనసందోహం మధ్యన బుధవా రం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం జరిగింది. జడ్పీటీసీ అనూష, టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా తరలి వచ్చిన జనంతో ఇంటింట ఎన్నికల ప్రచారం సాగింది.



చిలమత్తూరులో బాలకృష్ణకు మద్దతుగా ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ అనూష

సవిత నామినేషన్‌కు భారీగా తరలిన నాయకులు



పెనుకొండలో నామినేషన్‌కు తరలివెళ్తున్న వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు



సవిత నామినేషన్‌కు పరిగి మండలం నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 24: పెనుకొండ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి గతంలో ఎన్నడూలేనివిధంగా టీడీపీ అభ్యర్థి సవిత నామినేషన్‌కు బు ధవారం భారీగా జనం తరలి వచ్చారు. పెనుకొండ నియోజకవర్గం ఐదు మండ లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళ లు ఆటోలు, బస్సులు, వ్యాన్లలో భారీ ఎ త్తున పెనుకొండకు చేరుకున్నారు. సవిత నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో పెనుకొండ వీధులన్నీ టీడీపీ కార్యకర్తలతో కిక్కిరిసి పోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి.

హిందూపురం అర్బన్: తెలుగుదేశం పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత బుధవారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి పరిగి మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీ నుంచి భారీగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఉదయం 8 గంటల నుంచే ప్రత్యేక వాహనాల్లో, బస్సుల్లో వేలాదిగా తెలుగుదేశం కుటుంబ సభ్యులు రెట్టింపు ఉత్సాహంతో నామినేషన్ ప్రక్రియకు తరలారు.

రొద్దం: పెనుకొండలో జరిగే టీడీపీ కూటమి అభ్యర్థి సవిత నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ మండల నాయకులు తరలివెళ్లారు. రొద్దం నుంచి అన్ని గ్రామాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు బుధవారం వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో చిన్నప్పయ్య, జీవీపీ నాయుడు, మాధవనాయుడు, నరసింహులు, సుబ్బరత్నమ్మ, నరహరి, చంద్ర మౌళి, టైలర్ ఆంజనేయులు, నాగేంద్ర, సర్పంచ్ మంజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎంఎస్ రాజు నామినేషన్‌కు తరలిన తెలుగు తమ్ముళ్లు



అగళి నుంచి తరలివెళ్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు

అగళి, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంఎస్ రాజు నామినేషన్ కార్యక్రమానికి బుధవారం అగళి మండలం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. జడ్పీటీసీ ఉమేష్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

గుడిబండ: మడకశిరలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎంఎస్ రాజు నామినేషన్ కార్యక్రమానికి తెలుగుతమ్ముళ్లు పెద్దఎత్తున గుడిబండ నుంచి తరలి వెళ్లారు. మాజీ జడ్పీటీసీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో అన్ని పంచాయతీ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వాహనాల్లో తరలి వెళ్లారు. ఎంఎస్ రాజు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి చర్మిళ రిషిత కార్తీక్ గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

ఆకట్టుకున్న ఉట్లపరుష

పెనుకొండ, ఏప్రిల్ 24: పట్టణంలోని బోయగేరిలో వెలసిన రామాలయంలో బుధవారం నిర్వహించిన ఉట్లపరుష కార్యక్రమం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయంలో ఉదయం అర్చ కులు పంచాంగం శేషప్పస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉట్లపరుష నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బురద పూసిన ఉట్లమానును ఎక్కడానికి యువకులు చేసే ప్రయత్నం, జారి కిందపడే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. చివరకు సాయి అనే యువకుడు ఉట్లమానుఎక్కి విజేతగా నిలిచి బహుమతి అందుకున్నాడు.

ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడుతున్న యువకులు



కోటేనాడులో కొలువుదీరేదెవ్వరో..?

రేపే తొలివిడత ఎన్నికలు



కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప



బీజేపీ అభ్యర్థి గోవిందకార్‌జోళ

పావగడ, ఏప్రిల్ 24: కల్పతరు కోటేనాడుగా పేరు గాంచిన చిత్రదుర్గం పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి, కొలువు దీరే నాయకుడు ఎవరని ఓటర్లలో సందిగ్ధం నెలకొంది. ఎస్సీ రిజర్వే షన్‌కు చెందిన చిత్రదుర్గం లోక్ సభ నియోజకవర్గం పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక్క బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 18.57లక్షల ఓటర్లు ఉన్నారు. 2019లో బీజేపీ నుంచి పోటీ చేసిన నారాయణస్వామి 6,26,195 ఓట్లు పొందగా, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్పకు 5,46,179 ఓట్లు వచ్చి ఓటమి పాలయ్యారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పావగడలో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేష్‌కు 83 వేల ఓట్లు రాగా జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పకు 72వేల ఓట్లు, బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్‌కు 7 వేల ఓట్లు వచ్చాయి. అయితే ప్రస్తుతం బీజేపీ, జేడీఎస్ పొత్తు కుదిరడంతో 79 వేల ఓట్లు ఎన్‌డీఏ అభ్యర్థికి లభించవచ్చని పావగడ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ముందు పెట్టుకొని ఆ పార్టీ అభ్యర్థి చంద్రప్ప ఓటర్ల ముందుకు వెళుతుండగా, బీజేపీ అభ్యర్థి గోవింద కార్‌జోళ సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు చేసిన సేవలను గుర్తుచేస్తూ, మోదీ పేరుతో ఓటర్ల వద్దకు వెళ తున్నారు. 2019లో కాంగ్రెస్, జేడీఎస్ పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగిన చంద్రప్ప జేడీఎస్ పార్టీ నుంచి గట్టిదెబ్బ ఎదుర్కొని ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం అదే జేడీఎస్ పార్టీ బీజేపీతో పొత్తు కుదుర్చుకుంది. మరి జేడీఎస్ వారు ఏపార్టీకి ఓట్లు వేస్తారోనని ఓటర్లలో తీవ్ర చర్చాంశనీయాంశంగా మారుతోంది. ఈ నియోజకవర్గానికి 15 సార్లు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, రెండు సార్లు జనతాదళ్, ఒక సారి ఇండిపెండెంట్, రెండు సార్లు ప్రజా సోషలిస్టుపార్టీ, రెండు సార్లు బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న చిత్రదుర్గానికి ఈసారి ఎవరు ప్రతినిధి అవుతారనేది ఓటర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంది.

ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయభేరి

హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



మాట్లాడుతున్న బీకే

పెనుకొండ, ఏప్రిల్ 24: ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయభేరి మోగిస్తుందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆయన బుధవారం సవిత నామినేషన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలోని 14అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అన్నివిధాలా అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ప్రధానమంత్రి యోజ్‌గార్ పథకం నిధుల ద్వారా అర్ధంతరంగా ఆగిపోయిన రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. కొత్తరోడ్ల నిర్మాణ పనులు చేపడతామన్నారు. టీడీపీ పాలనలోనే ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా, పర్యాటకంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి సాధించిందన్నారు. తాగు, సాగునీరు తెచ్చిన ఘనత, ప్రాజెక్ట్‌లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ప్రజల కష్టాలు తీరాలన్నా చంద్రబాబే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని బీకే కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరసింహులు నామినేషన్

పెనుకొండ, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి గా పాలసముద్రం నరసిం హులు బుధవారం నా మినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్, వెంకటరామిరెడ్డి నియోజకవర్గానికి చెందిన వందల మంది నాయకులు, కార్యకర్తలతో ఉదయం పార్టీ స్థానిక కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ వద్ద నా మినేషన్ దాఖలు చేశారు. న్యాయవాది లక్ష్మీ నారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుధాకర్ నామినేషన్‌కు తరలిరండి

గుడిబండ, ఏప్రిల్ 24: మడకశిరలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కే సుధాకర్ నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని ఆ పార్టీ మండల కన్వీ నర్ నాగరాజు బుధ వారం ఓ ప్రకటనలో కోరారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి సుధాకర్ నామినేషన్ కార్యక్రమాన్ని హాజరై విజయవతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.